dctelugu.com
# డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER

కరీంనగర్ | 03 శనివారం, అక్టోబర్ 2026







# గ్రామ పంచాయతీలో వైభవంగా 'స్వచ్ఛతా హి సేవా-2026' ముగింపు ఉత్సవాలు..

**బాల్యవివాహ రహిత గ్రామంగా ఏకగ్రీవ తీర్మానం**

**రామడుగు డీసీ**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛ భారత్ మిషన్' లో భాగంగా గత సెప్టెంబర్ 17, 2026 నుండి అక్టోబర్ 02, 2026 వరకు నిర్వహించిన 'స్వచ్ఛతా హి సేవా-2026' వారోత్సవాలు గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం ముగిసినట్టు వెలిచాల గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగారావు తెలిపారు. శుక్రవారం నాడు గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను పంచాయతీ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక గ్రామసభను నిర్వహించి పలు కీలక అభివృద్ధి, సామాజిక అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీర్ల నర్సింగారావు మాట్లాడుతూ.. ఘన వ్యర్థాల నిర్వహణ, నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. ముఖ్యంగా నాలుగు రకాల ఘన వ్యర్థాలను వేరు చేయడం, వాటి సురక్షిత నిర్మూలన పద్ధతులపై గ్రామస్తులకు వివరించామన్నారు. గ్రామంలోని పారిశుధ్య సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శ్రమదానం ద్వారా వాటిని పూర్తిగా శుభ్రం చేయించామన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్' ని నిర్మూలించాలని ప్రజలను చైతన్యపరిచామన్నారు. 'బాల్య వివాహ ముక్త్ భారత్ పిలుపులో భాగంగా, తమ గ్రామ పంచాయతీని "బాల్యవివాహాలు లేని పంచాయతీ" గా గుర్తించి బాలికల రక్షణ, విద్య, భవిష్యత్తును కాపాడే దిశగా గ్రామంలో ఎలాంటి బాల్యవివాహాలు జరగకుండా చూడాలని గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించినట్టు సర్పంచ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





**బాటనీ లో పీహెచ్ డీ డాక్టరేట్ పొందిన సందర్బంగా దైవలా రాధా -కనుకయ్యలను శుక్రవారం గ్రామ సభలో సన్మానించిన సర్పంచ్ వీర్ల నర్సింగరావు , వార్డు సభ్యులు**

# లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరత అందరికీ మార్గదర్శకం: కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ డీసీ:**

నిరాడంబర జీవితం, అత్యున్నత నిజాయతీతో దేశానికి దిశానిర్దేశం చేసిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఆదర్శమూర్తి అని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కొనియాడారు. శాస్త్రి జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ తో పాటు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ ప్రధానిగా శాస్త్రి అందించిన సేవలు, పాటించిన విలువల ప్రాముఖ్యతను వివరించారు. ఆయన అందించిన చారిత్రాత్మక "జై జవాన్ – జై కిసాన్" నినాదం నేటికీ దేశ ప్రజల్లో, యువతలో గొప్ప చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపుతోందని పేర్కొన్నారు. ఈ నివాళి



కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) సుధాకర్ తో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

dctelugu.com
డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER

కరీంనగర్ | 03 శనివారం, అక్టోబర్ 2026




# 34 జిల్లాల జట్లతో కబడ్డీ సమరం:

**వేములవాడలో ఘనంగా రాష్ట్రస్థాయి పోటీల ప్రారంభోత్సవం**




**వేములవాడ డీసీ :**

రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్రస్థాయి బాలుర, బాలికల కబడ్డీ పోటీలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా టోర్నమెంట్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజుతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని 34 జిల్లాల నుంచి విచ్చేసిన కబడ్డీ జట్ల క్రీడాకారులను ముఖ్య అతిథులు పరిచయం చేసుకుని, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దివ్య క్షేత్రమైన వేములవాడలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్నే కాకుండా మానసిక ఉల్లాసాన్ని, క్రీడాస్ఫూర్తిని, పరస్పర స్నేహభావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు, కోచ్‌లకు భోజన, నివాస వసతుల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటి రాష్ట్ర, జాతీయ స్థాయిలో నూతన రికార్డులు సృష్టించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులు, గ్రామ పెద్దలు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేపు అంబేడ్కర్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో కరెంట్ ప్రసారంలో అంతరాయం

**కరీంనగర్ డీసీ :**

కరీంనగర్ పట్టణ పరిధిలోని అంబేద్కర్ నగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ముందస్తు నిర్వహణ, సాంకేతిక మరమ్మత్తు పనుల కారణంగా సెప్టెంబర్ 3న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు టౌన్-× విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (టాణజు) శ్రీనివాస్ గౌడ్ వివరాలను వెల్లడించారు. సబ్‌స్టేషన్ పరిధిలో చేపట్టే ఈ మరమ్మత్తుల నిమిత్తం సెప్టెంబర్ 03, 2026న ఉదయం 9:30 గంటల నుండి ఉదయం 11:00 గంటల వరకు కరెంట్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యుత్ అంతరాయం ఆదర్శ్ నగర్, సుభాష్ నగర్, బుట్టి రాజారాం కాలనీ, కిసాన్ నగర్, ఎస్టీ కాలనీ, ప్రవిష్ట అపార్ట్‌మెంట్ ప్రాంగణం, అంబేద్కర్ నగర్, ఖాన్ పూరా, దుర్గమ్మగడ్డ, హుస్సేనిపురా, గాంధీ చౌరస్తా , నాకా చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలలోని విద్యుత్ వినియోగదారులు సదరు సమయాన్ని గమనించి, పనులకు అంతరాయం కలగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక పనులు వేగంగా పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బందికి ప్రజలు, వినియోగదారులు పూర్తిస్థాయిలో సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.